# క్రీడలతో మానసికోల్లాసం

- కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్

వనపర్తిటౌన్, జనవరి 7 : నిత్యం క్రీడల్లో పాల్గొనడంతో శారీరక ధారుడ్యం తోపాటు మానసి కోల్లాసం పొందవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయ మైదానంలో నిర్వహిస్తున్న జన మైత్రి క్రికెట్ పోటీల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ అధికారుల జట్టు, మీడియా ప్రతినిధుల జట్టు తలబడ్డాయి. ఈ పోరులో ఏడు పరుగుల తేడాతో మీడియా జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా చదువుతోపాటు క్రీడాల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లాలో రోడ్డు భద్రతకు, ట్రాఫిక్ నియంత్రణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన జీపును కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వారన్నారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, బైకుపై వెళ్లే సమయంలో హెల్మెట్, కారులో సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు రోడ్డు భద్రత గోడపత్రికను ఆయన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జనవరి 8న సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ ఐడీవోసీ నుంచి నల్ల చెరువు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి మానస, డీపీఆర్వో సీతారాం, డీవైఎస్వో సుధీర్‌రెడ్డి, డీఈవో అబ్దుల్ ఘని, అధికారి నగేశ్ పాల్గొన్నారు.

**విద్యార్థులను భాగస్వాములను చేయాలి**

జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల అంశంపై విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈనెల 10వ తేదీన అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న విద్యార్థులకు రోడ్డు భద్రతపై పోస్టర్లను తయారు చేసి పోటీలను నిర్వహించాలని ఆదేశించారు. జనవరి 24న అన్ని విద్యా సంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై క్విజ్ పోటీలు నిర్వహించాలని, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ఇవ్వాలని చెప్పారు. రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి ప్రాణాలను రక్షించుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో హెల్మెట్ పెట్టుకొని ద్విచక్ర వాహనం నడిపే వారిని, సీట్ బెల్ట్‌తో కారు నడుపుతున్న వారిని జిల్లా రోడ్డు రవాణా అధికారి మానస, పోలీస్ సిబ్బందితో కలిసి వాహనదారులకు పువ్వులు ఇస్తూ అభినందించారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సునందినిదేవి, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా రోడ్డు రవాణా అధికారి మానస, ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, ఐటీఐ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

**పనులు త్వరగా పూర్తి చేయాలి**

పెబ్బేరు, జనవరి 7 : పెబ్బేరు మండలం పాతపల్లిలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. మంగళవారం ఆయన ఇండ్లను పరిశీలించి మొత్తం 50 ఇండ్లు మంజూరు కాగా అన్ని రూఫ్ లేవల్ పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన గోడలు, ప్లాస్టరింగు తదితర పనులను ప్రారంభించాలని సూచించారు. ఇప్పటి వరకు పూర్తి అయిన పనులకు ఎంబీ రికార్డు చేసి ఇస్తే బిల్లులు చెల్లించడం జరుగుతుందని ఇంజినీ మల్లయ్యను ఆదేశించారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ లక్ష్మి, ఎంపీవో రోజా పాల్గొన్నారు.

## ఆత్మస్థైర్యానికి క్రీడలు అవసరం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మెట్టుపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, జనవరి 7 : జిల్లా కేంద్రంలోని 6వ వార్డు మెట్‌పల్లికి చెందిన శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మంగళవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి బ్యాటింగ్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసి కోల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని, ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. యువత చదువుతోపాటు క్రీడాల్లో రాణించాలన్నారు. పోటీల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని 7వ వార్డుకు చెందిన కంచె రవి, 24వ వార్డుకు చెందిన ఆనంద్‌గౌడ్, 32వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సతీశ్ మాతృమూర్తి రుకునమ్మలు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం వారి స్వగృహాలకు వెళ్లి మృతుల పార్థీవ దేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యాన్నిచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, అశోక్, తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రహీం, జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్, రాము, మహేశ్వర్‌రెడ్డి, మాదవ్‌రెడ్డి, ముని, అఖిలేందర్, సుబ్బు, ముద్దుసార్, శ్రీను, గట్టన్న, చంద్రయ్య, నర్సింహ పాల్గొన్నారు.

## అలంపూర్ అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే విజయుడు

ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, జనవరి 7 : అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు కేటాయించాలని మంగళవారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. ఎర్రవల్లి మండలానికి 220 కేవీ సబ్‌స్టేషన్, నియోజకవర్గానికి అవసరమైన విద్యుత్ పరికరాలను మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, గ్రామీణ బీటీ రోడ్ల రవాణ వ్యవస్థ, విద్యుత్ సమస్య నూతన మండలాలకు ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కోరారు. సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. అదేవిధంగా అలంపూర్ నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో సరైన రహదారులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని నియోజకవర్గానికి రహదారులు, భవనాలు మంజూరు చేయాలని మంగళవారం హైదరాబాద్‌లో రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఎమ్మెల్యే విజయుడు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే రాష్ట్రం అగ్నిగుండమే

- బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

మాట్లాడుతున్న పల్లయ్య

గద్వాల, జనవరి 7 : కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కక్ష్యపూర్వకంగానే మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టాలని చూడడం సిగ్గుచేటన్నారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందడం తప్పా ఏమి లేదన్నారు. ప్రపంచస్థాయిలో హైదరాబాద్ కీర్తి ప్రతిష్టను పెంచిన ఫార్ములా ఈ రేస్ పై రేవంత్‌రెడ్డి సర్కారు అనాలోచితంగా నిర్ణయం తీసుకొని కేసు పెట్టడం దుర్మార్గమైనా చర్య అని పేర్కొన్నారు. అక్రమంగా కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలని చూస్తే రాష్ట్రం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో అల్లోకల్లోలం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు గడ్డంభరత్‌బాబు, మాధవ్, ఓంకార్ పాల్గొన్నారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి టౌన్, జనవరి 7 : మార్చిలో జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాలో వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని, జనవరి 10వ తేదీ లోపు సిలబస్ పూర్తిచేయాలని, సంక్రాంతి పండుగ అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు దృష్టి పెట్టాలన్నారు. అందుకు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో అబ్దుల్ ఘని, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిల్లో పోలీసులకు అవార్డులు

గద్వాల అర్బన్, జనవరి 7 : విధి నిర్వహణలో ప్రజలకు అందించిన ఉత్తమ సేవలకు గానూ పోలీస్ అధికారులకు రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ అవార్డులు రావడం అభినంధనీయమని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని ప్రకటించిన సేవా పతకాలలో జిల్లా నుంచి ఎంపికైన హెడ్ కానిస్టేబుల్స్ నారాయణ, రవీందర్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, పురెందర్, వెంకటస్వామి గౌడ్‌లను ఆయన తన చాంబర్‌కు పిలిపించుకొని అభినందించారు. పోలీస్ శాఖలో ప్రజల మన్ననలు పొందేలా అధికారులు, సిబ్బంది చేసిన సేవలకు తప్పకుండ గుర్తింపు లభిస్తుందని, ప్రజలకు మరింత సేవ చేయాలని తెలిపారు.

## ప్రభుత్వ దవాఖానల్లోనే కాన్పులు జరిగేలా చూడాలి

- డీఎంహెచ్‌వో సిద్ధప్ప

అయిజ/మల్దకల్, జనవరి 7 : ప్రభుత్వ దవాఖానల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో సిద్ధప్ప ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మూడు నెలల్లోపే ఏఎంసీలను గుర్తించి నమోదు చేయాలన్నారు. కాన్పులను ప్రభుత్వ దవాఖానల్లోనే జరిగేందుకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మల్దకల్ మండలంలో ప్రతి గ్రామంలోని ప్రతి గర్భిణులు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలోనే కాన్పులు జరగాలా చూడాలని డీఎంహెచ్‌వో సిద్దప్ప అన్నారు. మంగళవారం మల్దకల్ పీహెచ్‌సీలో నిర్వహించిన మండల స్థాయి ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధరణ కాన్పులని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే జరగాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీపీవో కిరణ్మయి, ఎంహెచ్‌ఎస్‌వో ప్రసూన రాణి, డాక్టర్లు కిరణ్, రాజు, వరలక్ష్మి, శ్యాంసుందర్, తిరుమల్‌రెడ్డి, రామాంజనేయులు, జిల్లా వైద్య సిబ్బంది వరలక్ష్మీ, తిరుమలేశ్‌రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బెస్ట్ స్కూల్ అవార్డు

ధరూరు, జనవరి 7 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెస్ట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సి అవార్డును గెలుచుకున్నట్లు జీహెచ్‌ఎం ప్రతాపరెడ్డి తెలిపారు. మల్లారెడ్డి విద్యా సంస్థలు, హెచ్‌వైబీజీ టీవీ ఆధ్వర్యంలో ఈ అవార్డును మంగళవారం హైదరాబాద్‌లో మల్లారెడ్డి విద్యా సంస్థల అధినేత డాక్టర్ ప్రీతిరెడ్డి, టీవీ అధినేత రాజ గోపాల్ చేతులపై పాఠశాల ఉపాధ్యాయుల బృందం అందుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రాఘవేంద్ర, పీడీ శ్రీనివాసులు, సమగ్ర శిక్షా డైరెక్టర్ రాధారెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలపై చెలరేగిన మంటలు

- అప్రమత్తమైన సిబ్బంది
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

అయిజ, జనవరి 7 : పట్టణంలోని భద్రయ్య షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం మాధవ్ థియేటర్‌కు వెళ్లిన 11 కేవీ విద్యుత్ తీగలపై పిచుక పడి మృత్యువాత పడడంతో మంటలు చెలరేగి సబ్ స్టేషన్‌లో లైన్‌లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. పరిసరాల్లో ఉన్న ప్రజలు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది సరఫరా పూర్తిగా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న లైన్ ఇన్‌స్పెక్టర్ సర్వోత్తమ్, లైన్‌మెన్ విఠల్, స్పాట్ బిల్లర్ వీరేశ్ మృత్యువాత పడిన పిట్ట శరీరాన్ని కిందకు పడేసి, స్వల్ప మరమ్మతులు చేపట్టిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## ఎకరాకూ రూ.15వేలు రైతు భరోసా ఇవ్వాలి

- బీఆర్‌ఎస్ నేతల డిమాండ్

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అమరచింత, జనవరి 7 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట పెట్టుబడికి అందించే రైతు భరోసాను ఎకరాకు రూ.15వేలు అందజేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15వేలు ఇస్తామన్న రైతులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతూ అసెంబ్లీ సాక్షిగా ఎకరాకు రూ.12వేలు మాత్రమే ఇస్తామనడంతో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం అమరచింత రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తాసీల్దార్ రవికుమార్ రైతు భారోసాను ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కౌన్సిలర్ రాజ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు, మాజీ వైస్ చైర్మన్ రాజు, బీఆర్‌ఎస్వీ ఉమ్మడి జిల్లాల మాజీ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శి చిన్న బాల్‌రాజు, మాజీ సర్పంచులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ జాగృతి మక్తల్ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ కలాంపాషా, రాజేశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రైతుల వినూత్న నిరసన

పెద్దమందడి, జనవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రైతు భరోసా రూ.15వేలను వెంటనే విడుదల చేయాలని కోడుతూ మండలంలోని మద్దిగట్లలో మంగళవారం రైతులు, కూలీలు పంట పొలాల్లో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోస పూరిత హామీలు ఇచ్చి నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుభరోసా రూ.12వేలు తగ్గించి తెలంగాణ రైతుల నడ్డి విరిచేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వేణుయాదవ్, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్, గ్రామాధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతికపై అవగాహన పెంచుకోవాలి

- ఫ్లో బృందం ప్రతినిధి శ్రీజ సోగల

ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న 'ఫ్లో' ప్రతినిధులు

ఆత్మకూరు, జనవరి 7 : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శాస్త్ర, సాంకేతికత్వంపై అవగాహన పెంచుకోవాలని కలాం స్ఫూర్తి యాత్ర 'ఫ్లో' ప్రతినిధి శ్రీజ సోగల అన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన స్ఫూర్తియాత్ర బస్సు మంగళవారం ఆత్మకూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చేరుకున్నది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌రోజులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ఏఆర్, వీఆర్, రోబొటిక్స్, త్రీడి ప్రింటింగ్, ఏఐ, ఎంఎల్ వంటి ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలపై పట్టు సాధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులను సాంకేతిక, ఆధునిక విద్యా నైపుణ్యాలపై సామర్థ్యాన్ని పెంపొందించేందుకే యువ పారిశ్రామికవేత్త మధులాబాబు ఈ స్ఫూర్తి యాత్రను నిర్వహిస్తున్నారన్నారు. బస్సులోని ప్రయోగశాలను విద్యార్థులకు వీక్షింపజేసి వారి అనుమానాలను నివృత్తి చేస్తూ, పరిజ్ఞాన మేథస్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆధునిక, సాంకేతిక విద్యపై అవగాహన కల్పించేందుకు 'ఫ్లో' చేస్తున్న కృషి అభినందనీయమని మండల విద్యాధికారి బాలరాజు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, 'ఫ్లో' ప్రతినిధులు అర్చన నాగపూ, అజయ్‌రెడ్డి, దిలీప్‌కుమార్, సాయి సుబ్రమణ్యం, రోహిత్, రమేశ్ పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల టౌన్, జనవరి 7 : మారుతున్న కాలను గుణంగా వస్తున్న కొత్త టెక్నాలజీలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోబోటెక్ టెక్నాలజీపై ఒక రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టెక్నాలజీపై అవగాహన సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గద్వాల అర్బన్, జనవరి 7 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కల్యాన్‌కుమార్ తెలిపారు. సంగాల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి పట్టణంలోని తాయమ్మ ఆలయ నుంచి చర్చి వైపు ఎలాంటి అనుమతులు లేకుండ ఇసుక ట్రాక్టర్‌ను తీసుకెళ్తుండగ, బీరెల్లి చౌరస్తాలో పోలీసులు పట్టుకొని ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించారు.

## విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

అలంపూర్, జనవరి 7 : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని అలంపూరు పట్టణంలో మంగళవారం విద్యార్థులకు నేటి ఆధునిక సమాజంలో వైద్య సేవలు ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థల విశ్లేషణ అనే అంశంపై మండల స్థాయి ఉపన్యాస పోటీలు స్వామి వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.5వేలు(ఎల్లశివ నాగరాజు, ఉపాధ్యాయులు), రెండో బహుమతి రూపాయలు రూ.4వేలు (మోక్షేశ్వర్, ఉపాధ్యాయులు), మూడో బహుమతి రూ.3వేలు (జబీనా కాలేజీ అధ్యాపకురాలు), నాలుగో బహుమతి రూపాయలు 2000 (అనుష, కస్తుర్బా పాఠశాల) దాతల సహాయంతో బహుమతులు ఇవ్వనున్నట్టు యూత్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంజీవనాయుడు తెలిపారు. ఈ బహుమతులు జనవరి 12వ తేదీ వివేకానంద జయంతి రోజున ఇవనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రిపబ్లిక్ డే నుంచి రైతు భరోసా

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జనవరి 7 : కొత్త కోట మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మొదటగా రైతు భరోసాను రూ.6వేలకు పెంచుతూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రిపబ్లిక్ డే రోజు భూమిలేని అర్హులైన నిరుపేదలకు ఏటా రూ.12వేలు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, సీడీసీ చైర్మన్ బాబన్న, డాక్టర్ బాబు, మేస్త్రీ శ్రీను, నరేందర్ సాగర్, కృష్ణయ్య, మోహన్‌రెడ్డి, శ్రీను, భాస్కర్, గోకరయ్య, నాయకులు పాల్గొన్నారు.

## జీతగాడిలా పనిచేస్తా

- ఎమ్మెల్యే మేఘారెడ్డి

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, జనవరి 7 : వనపర్తి నియోజకవర్గం అభివృద్ధికి తాను పెద్ద జీతగాడిలా అహర్నిశలు పనిచేసి నియోజకవర్గ అభివృద్ధిలో మేఘా మార్కును చూపిస్తానని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారులకు రూ.1.12కోట్లు విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను, 215 మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల15లక్షల24వేల940 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అయన అందజేశారు. అనంతరం మహిళలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జనవరి 7 : తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. అర్హులైన క్రిస్టియన్ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈనెల 20వ తేదీలోగా tgobmms పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొని సంబంధిత పత్రాలను కలెక్టర్ కార్యాలయంలోని రూమ్ నెంబర్ 207లో సమర్పించాలని చెప్పారు. 18–50 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని, కుటుంబం నుంచి ఒక్కరూ మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, 5వ తరగతి చదివి బీసీ–సీ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఆధార్‌కార్డు ప్రామాణికమని వివరాలకు 08545232500 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

2024–25 విద్యా సంవత్సరానికి గానూ మార్చి 31వ తేదీ వరకు ఈపాస్ రిజిస్ట్రేషన్ పొడగించడం జరిగిందని షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి మల్లికార్జున్ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఫ్రెష్, రెన్యూవల్ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందేందుకు తమ వివరాలను ఈపాస్ వెబ్‌సైట్‌లో http://telanganaepass.cgg.gov.in నమోదు చేసుకోవాలని చెప్పారు. కళాశాల స్థాయి విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.

## రైతు సమస్యలను పరిష్కరించాలి

అమరచింత, జనవరి 7 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తు అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం అమరచింత డిప్యూటీ తాసీల్దార్ రెడ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ ఈనెల 9న రైతుల డిమాండ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేల రైతు భారోసా తోపాటు పండించిన పంటకు గిట్టుబాటు ధర తదితర సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్లు రాజన్న తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## దొంగతనాన్ని 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

- రూ.8.63లక్షల సొమ్ము రికవరీ
- డీఎస్పీ వెంకటేశ్వర్లు


దొంగతనం వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ

వనపర్తి టౌన్, జనవరి 7 : జిల్లా కేంద్రంలోని 9వ వార్డు లక్ష్మీనర్సింహ కాలనీలో జరిగిన దొంగతనాన్ని పోలీసులు 24 గంటల్లో ఛేదించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడిస్తూ లక్ష్మీనర్సింహ కాలనీలో ఆరు సంవత్సరాల కిందట ఇల్లు కొనుగోలు చేసి అల్వాల లక్ష్మి, నర్సింహగౌడ్ నివాసం ఉంటున్నారు. ఇంటి పక్కల ఉన్న మరో మహిళ అద్దె ఇంట్లో నివాసం ఉండి లక్ష్మితో పరిచయం ఏర్పరుచుకున్నారు. లక్ష్మి అదేకాలనీలో కల్లు డిపోలో పనిచేస్తుంది. తన భర్త రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారని రోజువారీ ఇల్లు తాళం వేసి తాళంను చెప్పుల డబ్బాలో వేసి వెళ్లింది. తన భర్త ఇంటికి వచ్చి తాళం తీసి అన్నం తిని యధావిధిగా తాళాన్ని చెప్పుల డబ్బాలో పెట్టి వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన అద్దె ఇంట్లో ఉంటున్న కోడేరు మండలం తీగలపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరి డబ్బాలో తాళం తీసుకొని ఇల్లు తెరిచి ఇంట్లో కబోర్డు బీరువాలో దాచిన బంగారు అభరణాలు, నగదును అపహరించినట్లు వెల్లడించారు. వారు రోజువారీగా కల్లు అమ్మగా వచ్చే నగదును, బంగారు షాపు యజమాని ఇచ్చిన సంచిని ఇంట్లోని కబోర్డ్‌లోనే ఉంచే వారని ఇది గమనించిన సదరు మహిళ వారు బయటికి వెళ్లగానే దొంగతనానికి పాల్పడిందని చెప్పారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని మహిళపై అనుమానంతో విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకుని, తన ఇంట్లోనే సజ్జాపై దొంగిలించి ఉంచిందని డీఎస్పీ చెప్పారు. మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మహిళ నుంచి దొంగతనానికి గురైన మూడు తులాల కంకణాలు, రెండు తులాల బంగారు గొలుసు, మూడు తులాల నల్లపూసల దండా, ఒక జత బంగారు కమ్మలు, 9 గ్రాముల బ్రాస్‌లెట్, 4 బంగారు ఉంగరాలు, 2 గ్రాములు ఒంకి మొత్తం 12 తులాల బంగారు, నాలుగున్నర తులాల వెండి, రూ.18,900 నగదు మొత్తం రూ.8,63,400 విలువ గల నగదు, బంగారును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. దొంగతనాన్ని ఛేదించడంలో సీఐ కృష్ణ, ఎస్సై జలందర్‌రెడ్డి, కానిస్టేబుల్ సుగుణమ్మ, ప్రవీణ్, అంజిలను ఆయన అభినందించారు. వీరికి ప్రోత్సహక నగదు పురస్కారాన్ని అందజేశారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I, KOTHAKAPU SARADHA R/o H.No: 9-130, Putanpally Village, Gadwal Mandal, Jogulamba Gadwal Dist. T.G., here by state that my name was recorded in my husband Passport No.M 6349141 as KATTA KAPU SHARADHA W/o KATTA KAPU BHEEM REDDY. I have changed my name as KOTHA KAPU SARADHA W/o KOTHA KAPU BHEEM REDDY

NT-MBNR

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748